క్లుప్తంగా

అక్రమ కట్టడాలకు నోటీసులు



అక్రమంగా నిర్మిస్తున్న భవనం

నారాయణవనం: మండల కేంద్రంలో సొరకాయల తాతా అన్నదాన డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ డాక్టర్ వేణయ్య, ఈఓ షణ్ముగం మాట్లాడుతూ సొరకాయలస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కట్టడాలు, వాణిజ్య సముదాయాలు, అద్దె గదులకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. పన్నులు కూడా నామమాత్రంగా చెల్లిస్తున్నారని తెలిపారు. అక్రమ కట్టడాలను వారం రోజుల్లో తొలగించకుంటే చట్ట ప్రకారం కూల్చేస్తామని స్పష్టం చేశారు.

రెండో పట్టణ సీఐగా నాగార్జునరెడ్డి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐగా నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తానన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

గౌరవ వేతనం కోసం వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు 15 నెలలుగా గౌరవ వేతనం చెల్లించడంలేదని కాటూరు ఎంపీటీసీ సభ్యుడు రవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ గౌరవ వేతనం బిల్లులను మూడు పర్యాయాలుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, అయితే బిల్లులు రిజక్ట్ అయ్యాయన్నారు. మళ్లీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత బిల్లులు పంపుతామని వెల్లడించారు.

'ఉపాధి' సమాచారమివ్వండి

నారాయణవనం: ఉపాధి పథకం కింద మండలంలోని సింగిరి కోన వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులపై పూర్తి సమాచారం ఇవ్వాలని బ్రాహ్మణతాంగాళ్‌కు చెందిన ధనుంజయులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. రోడ్డు నిర్మాణానికి మంజూరైన నిధులు, ఈ మార్గంలో తొలగించిన ఫల వృక్షాలను వెల్లడించాలని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ ఇన్‌చార్జిగా ద్వైత



వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారిగా ద్వైతను నియమిస్తూ వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఈ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వర్తించిన లావణ్యను విజయవాడ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేశారు.

సమస్య పరిష్కారించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టులో బీసీల ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దారు శ్రీదేవికి వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య మాట్లాడుతూ కల్లివెట్టులో 10 మంది బీసీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. అందులో ఇల్లు కట్టుకునేందుకు యత్నిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నట్లు ఆరోపించారు.దీనిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ ఇంటి స్థలాల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు సాగాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం పట్టణంలోని పీఆర్ అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ఇలాగే మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన జీవుల వెతలు

- మండుతున్న ఎండలు..జాగ్రత్తలే అండ
- ఉపాధి పనుల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- 42 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- పట్టించుకోని కూటమి సర్కార్



బీఎన్‌కండ్రిగ: వసతుల్లేని ప్రదేశంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



వరదయ్యపాళెం: మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

వరదయ్యపాళెం: ఎండలు మండుతున్నాయి.. కూలీ కెళ్తే గానీ పూట గడవని కష్ట జీవులకు పని ప్రదేశంలో కూటమి సర్కారు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టార్పాలిన్లు ఇవ్వాల్సి ఉంది. పనిచేసే చోట ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వేతన జీవులకు అదనపు భత్యం జమ చేయాల్సి ఉంది. సౌకర్యాలు లేక.. ఎండ వేడిమి తాళలేక చెట్ల కింద సేదతీరాల్సి వస్తోంది. మజ్జిగ మాట అటుంచితే.. కనీసం గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు లేదు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలు కల్పించే వారని, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంపై కూలీలు నిట్టూరుస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో గరిష్ఠంగా 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండే ఎండలో పనిచేయాలంటే ఎవరికైనా కష్టమే. ఈ క్రమంలో ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఏటా ఉపాధి ద్వారా 100 రోజుల పనిదినాలు సద్వినియోగం చేసుకునే కూలీలు 6 వేల మంది ఉన్నారు.

వేసవి భత్యం ఇలా..

ఉపాధి పథకంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం (టీఏ, డీఏ) ఖర్చు కింద గడ్డపారకు రూ.10, తట్టేందుకు రూ.5, మంచినీటికి రూ.5, ఐదు కిలో మీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.20 చొప్పున ఇవ్వాలి. వీటితో పాటు పని ప్రదేశాల్లో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై చిన్నచూపు చూడడంతో కూలీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పట్టించుకోని ప్రభుత్వం

ఓవైపు రోజురోజుకు వేసవి తీవ్రత అధికమవుతోంది. అయితే కూలీల ఇబ్బందులు కూటమి సర్కారుకు ఏ మాత్రం పట్టడం లేదు. కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోంది. కూలీలకు ఏమి జరిగితే మాకేం అంటూ మౌనముద్రలో అధికారులు ఉన్నారు. దీనిపై సర్వత్రా కూలీల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే పత్రికల ద్వారా ముందే హెచ్చరించినా కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.

ఆదేశాలు సరే.. నిధులు ఎలా?:

వేసవి మొదలైనప్పటి నుంచి జిల్లా ఉన్నతాధికారులు ఊకదంపుడు ప్రసంగాలతో ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కల్పించాలంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇందుకు కారణం ప్రత్యేక వసతులకు సంబంధించి నిధులు కేటాయించకపోవడమే. మొక్కుబడిగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఒక్కో మండలానికి 750 నుంచి 1000 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మొక్కుబడిగా సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఇవన్నీ కూలీలకు పంపిణీ చేయలేని పరిస్థితి. కారణం కూలీలకు సరిపోయేంత ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయకపోవడమే అందుకు నిదర్శనం. కేవలం పంపిణీ చేసిన ప్యాకెట్లను చూపుడుగా పనిప్రదేశాల్లో ఉంచుతూ స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు ఫొటోలతో వసతులు ఏర్పాటు చేసినట్లు చూపుకోవడం గమనార్హం.

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో అన్ని వసతులను తక్షణమే కల్పించాలి. దీంతో పాటు వేసవి భత్యం ఇవ్వాలి. కూలీలు కొలతల ప్రకారం పనిచేయడం కష్టం. పని ప్రదేశంలో కూలీలు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలి. ఎండలకు కూలీలు అల్లాడిపోతున్నారు. అధికారులు పని జరిగే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
–చిన్నిరాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, వరదయ్యపాళెం

కూలీలను ఆదుకోవాలి



ఉపాధి పనులు చేసే వారికి గతంలో వేసవి సమయంలో అదనపు కూలీ వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ ఊసే లేదు. వేసవిలో భూమి గట్టిగా ఉండడం వల్ల పని కష్టమవుతోంది. పైగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఇలాంటి సమయంలో కొలతల ప్రకారం పనులు చేయలేం. వేసవి భత్యం అందించి కూలీలను ఆదుకోవాలి.
–చెంచురామయ్య, వరదయ్యపాళెం మండలం

సత్యవేడు నియోజకవర్గంలో ఉపాధి కూలీలు, జాబ్ కార్డుల వివరాలు:

మండలం	జాబ్ కార్డులు	కూలీలు
వరదయ్యపాళెం	7305	5707
బీఎన్‌కండ్రిగ	7690	1200
కేవీబీపురం	9224	2200
నారాయణవనం	7424	1613
నాగలాపురం	5969	9551
సత్యవేడు	7875	2152
పిచ్చాటూరు	6207	10750

కార్మికులకు యూనిఫామ్ పంపిణీ



యూనిఫామ్ తీసుకున్న కార్మికులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీలో పనిచేసే కార్మికులకు ప్రతి సంవత్సరం ఆగస్టులో యూనిఫామ్, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులుతోపాటు బూట్లు, గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేస్తారు. కానీ గత సంవత్సరం ఆగస్టులో ఇవ్వాల్సిన వస్తువులు ఇవ్వకపోవడంతో 25న సాక్షిలో 'పారిశుద్ధ్య కార్మికులపై నిర్లక్ష్యం' అనే శీర్షికన కథనం వచ్చింది. కథనానికి స్పందించి అధికారులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నగేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో కార్మికులకు యూనిఫామ్, వస్తువులను పంపిణీ చేశారు.

రేషన్ బియ్యం అప్పగింత

సత్యవేడు: శ్రీసిటీ పోలీసులు ఈ నెల 24వ తేదీన స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం 10 బస్తాలను సోమవారం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బీఎన్ కండ్రిగకు చెందిన వ్యక్తి ఆటోలో తమిళనాడు నుంచి తీసుకువస్తున్న బియ్యం బస్తాలను శ్రీసిటీ పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏర్పేడు సీఐగా శ్రీకాంత్‌రెడ్డి



ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సీఐగా బి.శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జయచంద్ర రేణిగుంట అర్బన్ సీఐగా బదిలీ అయి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి విధుల్లో చేరారు. ఏర్పేడు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణతోపాటు సంఘ విద్రోహ చర్యలను నిర్మూలించేందుకు కృషి చేస్తానన్నారు.

ఇంటి స్థలాలు సొంత మండలంలోనే ఇవ్వాలి



తహసీల్దార్ వినతి పత్రం అందిస్తున్న తులసి రాజన్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు సొంత మండలంలోని ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసి రాజాన్ డిమాండ్ చేశారు. రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీపీఐ నాయకులు ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రేణిగుంట పంచాయతీలోని పేదలకు ఏర్పేడు మండలంలో ఇంటి స్థలాలు కేటాయించిందని అన్నారు. అక్కడ రైతులు కోర్టుకెళ్లడంతో పేదలకు ఇంటి స్థలాలను కేటాయించలేదని తెలిపారు. కావున గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇంటి పట్టాలను పరిగణనలోకి తీసుకొని వారికి రేణిగుంట మండలంలోని ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు మూడు సెంట్ల భూమిని ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇంకా జాప్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



సుందరయ్య మృత దేహానికి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అక్కరపాకం సుందరయ్యకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం నివాళులర్పించారు. రాచర్లలోని సుందరయ్య నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, నియోజకవర్గ వ్యవసాయ కమిటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి మల్లికార్జున రెడ్డి, నేతలు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు శివా యాదవ్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ఆందోళన



దళితులు, నేతలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడులో దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు దళితులతో కలసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 252, 253, 254లో ప్రభుత్వ భూమిని దళితుల ఇంటి స్థలాలకు కేటాయించాలని కోరారు. స్థానికేతరుడైన డాక్టరు బత్తెయ్యనాయుడు 1.75 ఎకరాలను స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు అమ్ముడు పోయి ప్రభుత్వ భూమిని స్థానికేతరులకు అప్పగించారని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ విశ్వనాథనాయుడు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అమర రాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ నైపుణ్యాభివృద్ధి విభాగంలో ప్రతిష్టాత్మకమైన బెస్ట్ 3 స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2025ను కైవసం చేసుకుంది. ఈ అవార్డ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీకి, ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సోమవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రముఖ సిఎస్ఆర్ మార్కెటింగ్, బ్రాండ్ హానాక్ సంస్థ వారిచే గ్లోబల్ సిఎస్ఆర్ అవార్డ్స్ 2025 ప్రదానోత్సవంలో ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, ఎక్స్ జనరల్ రమేష్ సచిదేవ్ చేతుల మీదుగా రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు.

వైద్యులను నియమించాలని వినతి

వరదయ్యపాళెం: సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని ప్రజలకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యసేవలు అవసరమని విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

స్కూటర్ ఢీకొని కారు ధ్వంసం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలో రైల్వే స్టేషన్‌కి వెళ్లే మార్గంలో సోమవారం రాత్రి తిరుపతి నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్‌కు వస్తున్న కారుని చెక్ పోస్ట్ నుంచి రేణిగుంటకు వెళ్లే స్కూటర్ వేగంగా వచ్చి ఢీ కొట్టిన సంఘటనలో కారు ముందుభాగం ధ్వంసమైంది. స్కూటర్‌ను అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారంతో రేణిగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని స్టేషన్‌కి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

7 నుంచి చెన్నకేశవుని వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నటు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యంత వేడుకగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు



పార్టీ స్థానిక కార్యాలయం వద్ద మణినాయుడు తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణినాయుడు స్పష్టం చేశారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మండల కన్వీనర్ ఆధ్వర్యంలోనే వైఎస్సార్‌సీపీ తరపున చేపట్టే అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, ఎస్సీ సెల్ స్టేట్ కార్యదర్శి గురునాథం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, క్రియా శీల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, స్థానిక నేతలు దేవదాసురెడ్డి, గురవయ్య, జయచంద్రనాయుడు, అశోక్, నాగూర్, వెంకటేశ్వర్లు, కిరణ్ యాదవ్, సుధీర్‌రెడ్డి, ప్రసాద్‌పాల్, వెట్టిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని ఉదయం 7 గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక్కుండా పాల్గొనాలని పేర్కొన్నారు.

కూలీలకు మధ్యాహ్న భోజనం

వరదయ్యపాళెం: సత్యవేడు మండలం వానెల్లూరు పంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు సోమవారం తిరుపతి జిల్లా అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగురవం భరణి బాస్ తన సొంత నిధులతో మధ్యాహ్న భోజనం అందించారు. 150 మంది కూలీలకు సర్పంచ్ ఎబినేజర్ చేతుల మీదుగా భోజనం పంపిణీ చేశారు.

రేపే పాలిసెట్

సత్యవేడు: స్థానిక పాలిటెక్నిక్, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలోని పరీక్ష కేంద్రాల్లో బుధవారం పాలిసెట్ నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. ఉదయం11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, ఎరైజర్, షార్ప్‌నర్ తెచ్చుకోవాలని కోరారు. డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల కేంద్రంలో హాల్ టికెట్ నంబర్ 4141001 నుంచి 4141150 వరకు , ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 4151001 నుంచి 4151150 వరకు విద్యార్థులకు కేటాయించినట్లు వివరించారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి రావాలని, 11 గంటల తర్వాత ఒక్క నిముషం ఆలస్యమైనా లోపలికి అనుమతించమని స్పష్టం చేశారు.

సప్లిమెంటరీకి ప్రత్యేక శిక్షణ



పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవి తెలిపారు. సోమవారం మదనంబేడు, ఇరుగుళం, దాసుకుప్పం, సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 189 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు.

సత్యవేడు సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాలగురవం బాబు

సూళ్లూరుపేట: సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ రూపవాణి కాసులకు కక్కుర్తిపడి నోటిఫికేషన్‌లో వున్న భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు ఆరోపించారు. ఆయన సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో ఉన్న కొన్ని భూములను గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేశారని, ఇందులో ఆమెకు భారీగా ముడుపులు అందాయని ఆరోపించారు. నోటిఫికేషన్‌లో వున్న భూములకు రిజిస్ట్రేషన్లు ఎలా చేస్తారని ప్రశ్నించారు. సూళ్లూరుపేట సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్న తహసీల్దార్లు సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడానికి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారని తెలిపారు. సత్యవేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం మండలాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని, ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అర్జున గురుమూర్తి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ, చిరంజీవి, వేల్‌రెడ్డి, శాంభం రాజన్, గురువయ్య పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులకు డిమాండ్

సత్యవేడు: ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగేళ్లుగా ఆపిన ప్రమోషన్లకు వెంటనే మంజూరు చేయాలని ఎస్ఎంయూ రీజనల్ అధ్యక్షుడు పెరుమాళ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సత్యవేడు ఆర్‌టీసీ డిపో ఆవరణలో కార్మికులు, ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకోసం 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్యవిధానం కొనసాగించాలని స్పష్టం చేశారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్యారేజ్ అధ్యక్షుడు కుప్పయ్య, సుధాకర్ కుమార్, గోపన్న . ఆనందరయ్య, ప్రకాష్, కరీముల్లా, వర్మ, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి నివాళి



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని పడమటి దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళి కుమార్తె అలైగ్య (22) ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ సోమవారం గ్రామానికి వెళ్లి విద్యార్థిని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తూర్పు హరిజనవాడలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నేత మునస్వామిని పరామర్శించారు. నేతలు అపరంజిరాజు, చిన్నదొరై సుధా, శ్యామ్, మోహన్ మొదలియార్, ఎల్.సురేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నా భర్త మృతికి గల కారణాలు తెలపండి



మంచం పైన టాక్సీ డ్రైవర్ మృతదేహం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): నా భర్త మృతికి గల కారణాలు తెలపండి అంటూ ఓ మహిళ సోమవారం రేణిగుంట పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు, మంగళం బీటీఆర్ కాలనీలో నివాసముంటున్న మురళీధరన్ (64) తిరుమలకు టాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం టాక్సీకి వెళ్తున్నాను అంటూ ఇంట్లో చెప్పి వెళ్లారు. అయితే సోమవారం ఉదయం తారకరామా నగర్‌కు చెందిన వేలు ఆచారి ఫోన్ చేసి 'మీ భర్త మా ఇంట్లో చనిపోయి ఉన్నాడు.' అని సమాచారం ఇచ్చాడని మృతుడి భార్య శాంతి పేర్కొన్నారు. భార్య కుటుంబ సభ్యులతో కలిసి తారకరామా నగర్‌లోని వేల్ వేలు ఆచారి ఇంటికి వెళ్లారు. వారి ఇంటి వరండాలోని మంచంపై మురళీధరన్ మృతదేహం ఉన్నట్లు తెలిపారు. ఆయన ఇక్కడికి ఎలా వచ్చాడని వేలు ఆచారిని ప్రశ్నించగా శనివారం రాత్రి తిరుపతిలోని వైన్ షాప్‌లో పరిచయమయ్యాడని రాత్రి నేరుగా వచ్చి ఇక్కడే పడుకున్నాడని చెప్పారు. అయితే ఆదివారం మధ్యాహ్నం అతనికి భోజనం పెట్టి జీవకోనలో పని ఉంటే వెళ్లి, సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడని ఆయన వివరించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె సోమవారం రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న రేణిగుంట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.